

# పరీక్ష

శ్రీమతి మాలతీ చందూర్

★

పొద్దుటే రైలు దిగి వచ్చాను. ఆయన ఆఫీసుకి వెళ్ళిపోయారు. పొద్దుటనుంచీ యిల్లు సద్దుకోడం, తుడిపించడం యిలాటివాటితో వూపిరి పీల్చుకునేందుకు కూడా తీరిక లేకుండా అయింది. వచ్చినప్పటినుంచీ సత్యవతి వస్తుందేమోనని క్షణం క్షణం ఎదురుచూస్తూనే వున్నాను. ఒకటి రెండుసార్లు పనిపిల్లని వెళ్ళి పిల్చుకు రమ్మనమని, చెబుదామని నోటిదాకా వచ్చింది. యీ లోపల మరో ముఖ్యమైనపని కంటికి అవుపడటంతో, ఆమాట నోట్లోనే వుండిపోయింది.

నాలుగయింది. ముందు హాలూ పడకగది కొత్త నివాసయోగ్యం చేసేటప్పటికి. స్నానం చేసి, చీర మార్చుకున్నాను. ఇంటివారమ్మాయి మరకతం వచ్చింది. నేను జడ అల్లుకుంటుంటే కూచుని క్షేమ సమాచారాలు విచారించాక, "మీ సత్యవతి లేచిపోయింది," అంది మరకతం.

బిత్తరపోయాను ఆ వార్తవిని. కాని ఆశ్చర్యం కనపరచకుండా—"డబ్బున్న వాడితోనేనా?" అని ప్రశ్నించాను.

మరకతం నా ప్రశ్నకు తెల్లపోయి చూసింది. అవును, మరకతానికి ఆ ప్రశ్న ఎలా అర్థం అవుతుంది? పదివేలు కట్నం యిచ్చి వాళ్ళనాన్న యాభైవేల రూపాయల ఆస్తివున్న ఆసామిని భర్తగా తెచ్చాడు మరకతానికి. ముక్కులకీ, చెవులకి ధగధగ మెరసే రవ్వలు ధరించిన మరకతానికి, నూరురూపాయలకి తక్కువ ఖరీదుగల పట్టుచీర కట్టడం ఎరగని మరకతానికి, హరిదాసు పదిసార్లూ, చంద్రలేఖ అరడజనుసార్లూ చూసిన మరకతానికి, బంగారంతో నోళ్లునింపుకున్న మరకతానికి, నా ప్రశ్న వెనక వున్న ట్రాజెడీ, సత్యవతి జీవితంలోని ట్రాజెడీ ఎలా, అర్థం అవుతాయి? అసలు నాకుమాత్రం అర్థం అయేదా సత్యవతి ఒక పట్టాన!

కిటికీలోంచి మబ్బులు కొందు కనపడుతున్నవి. మా మేడకన్నా ఎత్తైన మేడలూ, పిల్లలు ఎగరవేసే గాలిపటాలు కనపడుతున్నాయి. మరకతం కుర్చీలో కూచుంది. పచ్చని చెక్కిళ్ళమీద రవ్వల దుద్దులు ప్రతిబింబిస్తున్నాయి.

* * *

అయిదేళ్ళ క్రితం ఒకానొక విచిత్రసంఘటన వల్ల సత్యవతిని నేను మొదటసారి పలకరించాను. అప్పటికి నేను మద్రాసు కాపరానికివచ్చి రెండు మూడు నెలలు అయింది. ఇళ్ళు దొరకని రోజుల్లో బ్రహ్మప్రయత్నంమీద జార్జిటవున్‌లోని యిరుకు సందుల్లో, ఒక మేడమీద భాగం దొరికింది మాకు. ఆయన ఆఫీసుకు వెళ్ళాక, మధ్యాహ్నం వేళ చేసేపని లేక, కాలం గడవక, అలా డాబా ముందుకి వచ్చి, గంటలు గంటలు గడిపేదాన్ని. ఒక పక్క చిన్న టీషాపు, ఎదురుగుండా లాండ్రీ, సందుచివరని కార్పొరేషన్ స్కూలు పిల్లల రొద, రోడ్లమ్మటబోయే అయిస్ ఫ్రూట్ వాడి కేకలు—యివన్నీ ప్రతిరోజూ మధ్యాహ్నం నేను చూసేదృశ్యాలు, వినే శబ్దాలు.

సాయంత్రం అయిదింటికి వంటచేసేసి, స్నానం డ్రెస్సింగూ పూర్తి చేసుకుని అలా డాబాలో, ఆయనకోసం నిరీక్షిస్తూ నుల్చునేదాన్ని. ఆయనవచ్చి పెద్ద మాట్లాడుతారని గాని, షికారుకో సినిమాకో తీసుకెళ్తారని గాని గాదు. ఊరికే నిల్చొ

డంలో, శూన్యం లోకి చూడడంకన్న, ఆయన కోసం నిరీక్షించడంలో కాస్త కాలక్షేపం కనిపించేది. అయిదుగంటలకి నేను డాబాలో నిల్చుని, వచ్చిపోయే జనాన్ని చూస్తూండేదాన్ని. ప్రతినిత్యం అయిదూ అయేవేళ-సన్నగా పొడుగ్గా వున్న అమ్మాయి తలవంచుకు వెళ్ళేది. ఆయన కోసం చూస్తున్నట్టే, ఆ అమ్మాయి రాకను పరిశీలించడంకూడా నా దినకృత్యాల్లో ఒకటిఅయిపోయింది. ఆ అమ్మాయీ, ఆయనా ఏడెనిమిది నిముషాల తేడాలో వస్తూండేవారు. ఏరోజునన్నా, ఆయన ముందుగా యింటికొచ్చినా, ఆ అమ్మాయి ఆసందమ్మట వెళ్ళడం చూడనిదే నాకు లోపలికి వెళ్ళబుద్ధి అయేదికాదు.

ఆ అమ్మాయి మా సందులోంచి-అంటే మా యిల్లుదాటాక నాలుగోయింటిని ఆనుకునివున్న చిన్న గల్లీలోకి, వెళ్ళిపోతూండేది రోజూ. ఒకరోజున తల్లో జాజుల దండ సద్దుకుంటూ, డాబాలోంచి కిందకు వంగిచూస్తున్నాను. గబాలున దండ జారి, ఆదారినే వెళ్తున్న అమ్మాయిమీద పడింది. ఆఅమ్మాయి వులిక్కిపడి పైకి చూసింది. నేను చిరునవ్వుతో పల్కరిస్తూ కిందకి దిగాను. ఏంచెయ్యాలో తెలీక దండపుచ్చుకుని, నడిరోడ్డుమీద నుల్చుండిపోయిన ఆ అమ్మాయి, నన్నుచూసి రెండడుగులు నావైపుగా వేసింది.

"పొరబాటునపడింది. ఏం అనుకోకండేం!"

"ఫరవాలేదులెండి," అంది తనూ నవ్వుతూ.

"తెలుగువారా మీరు?"

"అవును"

"చదువుకుంటున్నారా?"

"ఆ..."

ఆ మర్నాటినుంచి రోజూ మా యింటివద్ద ఆ అమ్మాయి తలెత్తి నవ్వడం, నేను చిరునవ్వుతో సమాధానం యివ్వడం-యిలా పదిరోజులు గడిచాయి.

ఆ రోజు ఆఫీసులో ఏదో టీపార్టీ వుందనీ, ఎనిమిదింటిదాకా రాననీ చెప్పివెళ్లారు. గడియారపు ముల్లును పాతేసింది కాలం. అయిదింటికి ఆ అమ్మాయిని చూడంగానే, "ఆగండి" అని సౌంజ్ఞచేసి, కిందకి వెళ్లాను.

"లోపలికి రండి. కాసేపు కూచుని వెళ్దురుగాని," అన్నాను చెయ్యిబుచ్చుకుని.

"ఇంట్లో చెప్పలేదు. మరోసారి వస్తాను." అంది అక్కడే నుల్చుని.

"పది నిమిషాల్లో వెళ్ళిపోదురుగాని," అని చెయ్యిపుచ్చుకుని తీసుకొచ్చాను.

మనిషి సన్నగా పొడుగ్గావుంది. ముఖం సామాన్యంగా వుంది. చవకబారు చీర, జాకెట్టూ, వేసుకుంది. చెవులకీ చేతులకీ ఏమీ లేవు. మెళ్లో పండిపగడాల తావళం. చాలా భిడియంగా కూచుంది.

"ఏం చదువుతున్నారు?" అన్నాను, కాఫీ యిచ్చాక.

"ఫిఫ్త్ ఫారమ్''అంది.

"ఎక్కడుంటున్నారు?''

"యీపక్క-వాషర్ మెన్ యాలీలో-నాలుగో నెంబరు యింట్లో...''

"అప్పుడప్పుడు వస్తూవుండండి. ఎంతో బాగు. తమిళంరాదు నాకు,''అన్నాను.

"శని ఆదివారాలు గాని తీరిక వుండదు. అప్పుడు గూడా హోమ్‌వర్క్ ఒకటుంటుంది యింట్లో కాస్త పని సాయం జెయ్యాలి. శనివారం సాయంత్రం వస్తాలెండి," అంది.

వీధిగుమ్మంలోకి వచ్చాక, పేరు అడిగాను. సత్యవతి అని చెప్పింది. 'మీ పేరేమిటి?' అని నన్ను అడిగింది.

* * *

శనివారం నాలుగ్గంటలవేళ వచ్చింది సత్యవతి. ఆయన యింట్లో లేరు. ఇద్దరం చాలాసేపు ఖబుర్లు చెప్పుకున్నాము. సత్యవతి అఖండ తెలివితేటలున్న మనిషి కాదు. ప్రపంచజ్ఞానం వున్న మనిషి. మనసు కరిగించే దీనురాలు ఆమె.

"మీరు ఎదురుచూస్తూంటారని వచ్చాను. లేకపోతే మానేద్దామనుకున్నాను," అంది.

"ఏం, శెలవురోజున కూడా అంత పనేముంది నీకు?"

"హోమ్‌వర్క్ చేసుకోవాలి. వుత్తరోజుల్లో ఎలాగా వీలుండదు, శెలవురోజునన్నా వంటచెయ్యకపోతే మా బామ్మ వూరుకోదు.

"మీ యింట్లో చాలామంది వున్నారేమో—నువ్వే ఎందుకు వంట చెయ్యడం?"

"మా అక్కకి పిల్లలు, వదినకు పిల్లలు. మా పెదమ్మకు పార్శ్వపు నెప్పి ఎప్పుడూ వుంటుంది. వుత్త రోజుల్లో అయితే వూరుకుంటారు. శెలవ రోజుల్లో కూడా..." అని ఆగిపోయింది.

"పొద్దున్న వంట కూడా నువ్వేనా?" అన్నాను.

"శని ఆదివారాలు నేనే జేస్తాను. మధ్యాహ్నం నేనూ వదినా కూచుని అప్పడాలు వత్తాము. యీ

సాయంత్రం మా అక్క వంట చేసేందుకు వస్తుంది. అయినా మా ముసలమ్మ వూరుకోదు," అంది మాట ఆపి.

కాసేపు వున్నాక, "మీరు మా యింటి కోసారి రారాదూ? మా వాళ్ళనీ, యింటినీ చూద్దురు గాని. ముఖ్యంగా మా ముసలమ్మ మిమ్మల్ని చూస్తే. నేను మీ యింటికి అప్పుడప్పుడొచ్చేందుకు కాస్త వీలుగా వుంటుంది. రేపు వస్తారా?" అంది వుత్సాహంగా.

వాళ్ళ ముసలమ్మ నన్నెందుకు చూడాలో నాకు అర్థం అవలేదు. సత్యవతినిబట్టి వాళ్లవాళ్ళని చూడాలని నాకూ కుతూహలం కలిగింది.

మర్నాడు మధ్యాహ్నం ఆయన నిద్రబోతూంటే నేను సత్యవతి యింటికి వెళ్ళనానికి బయలుదేరాను.

వాషర్ మెన్ యాల్లీ అంటే అదోక కాలనీ అనుకునేరు. అది కాలనీ కాదు, గల్లి. ఆ గల్లీలో ఆరిళ్లు వున్నాయి. ఆతర్వాత గల్లీ మరో సందులోకి కలిసి, పేరులో గూడా మార్పు చెందుతుంది. ఆరిళ్లలో మొదటి రెండూ మొదలియార్లవి. మూడూ అయిదూ పాలవాళ్ళవి. ఈ రెంటికీ మధ్యనున్న నాలుగో యింట్లో వున్నారు సత్యవతీవాళ్ళు. ఆ యిల్లుగూడా మొదలియార్లదే. పైన యింటివాళ్ళున్నారు. కింద అద్దెలకి ఎనిమిది సంసారాలున్నాయి. ఒక్కొక్క సంసారానికీ కనీసం ఆరు మొదలు పదిదాకా మనుషుల సంఖ్య వుంటుంది. నాలుగోయింటి వెనకభాగంలోని రెండు గదులూ, కూటం - ఇది సత్యవతి గారి వాటా. ఆ గదులకి కిటికీలు లేవు. పైనముందుకు అద్దాలున్నాయి. ఆ అద్దాలమీద యింటివాళ్లు కూచోకబోతే, లేక బట్టలో, పీటలో వెయ్యకబోతే కాస్త వెల్తురు వస్తుంది; లేకబోతే చీకటి సుయ్యారం. ఇంటికి లైట్లు లేవు, బాత్ రూమ్ లేదు. ఒకే ఒక పంపు. ఒకే లావెట్రీ. కింద భాగంలోవున్న అందరికీ అదే మరుగుదొడ్డి.

ఇంటికి రెండువైపులావున్న పాలవాళ్ళ గొడ్ల సావిడిలోంచి యిరవై నాలుగు గంటలూ, దోమలూ, దుర్వాసనా వస్తూనేవుంటాయి. వీధిలో చేపపొలుసులూ, ముడుసులూ-యిలాంటి పదార్థాలు నిత్యం కనపడుతూనే వుంటాయి. వీధివాకిట్లో అరుగుమీద సత్యవతి నాన్నా, పెదనాన్నా కూచుని చుట్టపొగ వదుల్తూ మాసిపోయిన పేకముక్కల్తో పేకాడుకుంటున్నారు.

ఎనిమిదిళ్ళవాళ్ళ రొద్దమధ్యనుంచి సత్యవతీవాళ్ల వాటాలోకి అడుగెట్టాను. కూటంలో ఒకమూల చింకిచాపమీద - ముసలావిడ పడుకుని ఏదో గొణుగుతూ కునుకుతీస్తోంది. మరోమూల సత్యవతి పెదమ్మగారు పార్శ్వపునొప్పితో-తలకిపట్టీ ఏదో వేసుకుని బాధపడ్తోంది. సత్యవతి వదినగారు సన్నగా పీలగా వుంది. ముఖం కలకలలాడుతున్నా, సరిఅయిన పోషణా ఆహారం లేక చిక్కిపోయినట్టు స్పష్టంగా కనిపిస్తోంది. చంటిపిల్లను వడిలో వేసుకుని పాలిస్తోంది ఆమె. సత్యవతి అక్కగారు ఒకపక్కగా కూచునివుంది. సత్యవతి అక్కపిల్లలూ ఒదినపిల్లలూ కూటంలో ఒకమూలగా కూచుని, గుళ్ళూ గవ్వలూ పెట్టుకుని ఆడుకుంటున్నారు.

సత్యవతిఅప్పగారూ ఒదినగారూ నాతో యీమాటా ఆమాటా మాట్లాడారు. యిద్దరూ ప్రపంచ జ్ఞానం తెలిసినవాళ్లే. పక్కగదిలోంచి 'కాఫీ' అని కేకవినిపించింది. సత్యవతివదిన కాఫీ కలిపేందుకు లేచింది.

"మా అన్నయ్య శెలవుగదా అని నిద్రపోతున్నాడు. అదోగదీ, యీకూటం, వంటగది. యిదే మాయిల్లు" అంది సత్యవతి చిరునవ్వుతో. నేనూ నవ్వాను ఏమనాలో తెలీక.

ఇంట్లో పిల్లాపాపా - ముసలమ్మ దగ్గరనుంచి పాలుదాగే పిల్లదాకా - అందరూ కాఫీ సేవించారు. కాఫీతాగి, నేను యింక లేవబోయాను.

ఈలోపలే ముసలమ్మ లేచి, తిట్లు అందుకుంది. నల్లమందు అయిపోయిందట. డబ్బులేక తేలేదన్న విషయం నాకు తెలియకుండా కప్పెడుదామని, ఎంతప్రయత్నించినా దాగలేదు. ముసలమ్మ తిట్ల ప్రవాహం ఒకపట్టాన ఆగేటట్టులేదు. ఆతిట్లు విననట్లు నేనూ నటించాను. వాళ్ళూ నటించారు, నేను లేచి శెలవుదీసుకువచ్చేశాను.

* * * *

మళ్లీ ఆదివారం మేమిద్దరం కూచుండగా సత్యవతే ఎత్తింది తమయింటి ప్రస్తావన.

"మాశారుగా మాయిల్లు. అదీపద్ధతి. సంపాయించేది వాడొక్కడూ. తినేది పదిమంది. అందులో మాముసలమ్మ వుందేం-ప్రాణాలు తోడేస్తుంది."

"మీ అక్కపిల్లలు ఎదిగారుగా, ఆ అమ్మాయి గూడా ఏకుట్టుపరిక్షో, నేతపరిక్షో పాసవుతే యింత బాధ వుండదుగదా," అన్నాను. అప్పటికే నాకు సత్యవతీ, సత్యవతి అప్పగారూ వితంతువులని తెలిసింది.

"దానికి అత్తారిచ్చిన రెండెకరాల పొలం వుంది. అది చూసుకుని మహాఐశ్వర్యం వున్నట్టు మురిసిపోతుంది. యిక్కడ చెంబక్కడ పెట్టదు." అంది.

"మీ అన్నయ్య చెప్పరాదా గట్టిగా..."

"సరె—మా యింట్లో మగవాళ్లకి నోరుంటే బాగానే వుండును. కాటికి కాళ్ళు చాచుకున్న మా ముసలమ్మకి ఎంత నోరో—స్కూలునుంచి రావడం వోనిమిషం యిటూ అటూ అయితే—పది రంకులు కడుతుంది. నిజంగా మా వదిననూ అన్నయ్యనూ చూస్తే నాకు చాలా జాలేస్తుంది..."

"నీ సంగతో—పోనీ మీ మావగారు ఏదన్నా సాయం చెయ్యరాదా?"

"సరే—మా మావగారికి నలబైరూపాయలు జీతం నా పెళ్లివేళకి. మా ఆయనకి చదువూ లేదు—సంపాదనా లేదు. ఏదో ఆడపిల్లల్ని విరగడ చేసుకో వాలిగదా అని మావాళ్లు—మా అక్కకూ నాకూ—మొగవాళ్ళనంటూ వెతికి, పెళ్లి అయిందనిపించారు. నా పెళ్లికి ఏడాదిక్రితమే మా అత్తగారు చచ్చి పోయింది..."

"పోనీ, అక్కడే యింట్లో పనీపాటూ చూస్తూ, చదువుకుంటూవుంటే బాగుండేదేమో — యింతకంటే..."

"ఇంతకంటే అక్కడ మరీ ఘోరం. మా మావగారు ఒక మళయాళీదాన్ని తెచ్చిపెట్టుకున్నారు. యిప్పటి ఆవిడకు ముగ్గురు పిల్లలు. అక్కడుండి, యింట్లో వాళ్లందరికీ వండి వార్చి పెడుతూంటే, యింత అన్నంబెట్టి, ఏడాదికి రెండు చీరెలు యిస్తానని చెప్పారాయన..."

"బాగుంది. ఆస్తి లేదా?"

"ఆస్తి—లేకేమిటి? ఒక మళయాళీ ఆవిడా—ముగ్గురు పిల్లలు, వాళ్లకి రోగాలు, రోగాలకి మందులు. యిదంతా ఆస్తి కాదూ? ఇంకేమిటి కావాలి చెప్పండి?"

"అసలు నువ్వు కాపరానికి వెళ్లకుండానే అతను పోయాడా?"

"వెళ్లకేం? అన్ని లక్షణాలూ అయాయి. నేను పురిటికి యిక్కడికి వచ్చినప్పుడే, కలరావచ్చి, మూడోరోజున ఆయనదారి ఆయను చూసుకున్నారు. కొడుకు దహనానికి కూడా డబ్బులేదని హడావుడి చేశాడు మా మావగారు. భర్త మరణంతర్వాత నాకు పుత్రశోకం అన్ని అనుభవాలు అయిపోయాయి," అని కఠినాతి కఠినంగా నవ్వింది సత్యవతి.

"అయితే మీ నాన్నా, పెదనాన్నా ఏంపని చెయ్యరా?"

"ఎందుకు చేస్తారు? వాళ్ళకి మొదటినుంచీ చీట్లాడటం, చుట్టలు కాలవడం—యీ రెండు పనులే తెలుసు. యివ్వాళ వాళ్లని వొళ్లొంచి పని చెయ్యమంటే ఏం చేస్తారు?"

"మరి సంసారం గడవడం ఎలా?"

"మా అన్నయ్యని బి. ఏ. దాకా చదివించారుగా. ఆ బి. ఏ. దాకా చదివించిన చదువే వాళ్ల పెట్టుబడి ఇప్పుడు వాడి నెత్తిన ఎక్కి అంతా తింటూ కూచున్నారు."

"మీ అన్నయ్యకు వుద్యోగం రాకమునుపో-"

"నాకు బుద్ధి తెలిసినప్పటినుంచీ, అంటే నాకు పెళ్ళయి అత్తారింటి కెళ్లినప్పటినుంచీ వాడు సంపాయిస్తున్నాడు—వీళ్లు తింటున్నారు. మా వదిన చాకిరీకి, వాడి సంపాదనకీ, వీళ్ల తిండికి సరిపోతుంది. నాకు ఆరేళ్లు వచ్చినప్పటినుంచీ పాతచీట పేక ముక్కలూ, చుట్టపొగలూ, నల్లమందు—యివన్నీ అలవాటే మాయింట్లో. మా అన్న వుద్యోగంలో చేరేదాకా, వున్న ఆస్తిమీద అప్పుచేసుకుతింటూ, మా పెళ్ళిళ్లు చేశారు. ఇప్పుడు ఆస్తికి మించి అప్పులున్నాయి. నాకు గ్రాహ్యం తెలిసినప్పటినుంచీ—చీట్లపేక, నల్లమందు, చుట్ట పొగలు, గావు కేకలు అలవాటే," అంది సత్యవతి.

"ఆ పోయినవాడు ఎలాగా పోయాడు. వెంటనే నిన్నా స్కూల్లో జేర్చితే యీపాటికి స్కూలు ఫైనలు అయిపోయేది. నువ్వు మొదట్లో అశ్రద్ధ చెయ్యకుండా వుండాల్సింది."

"అసలు మొదట్లో ఆలోచించేందుకూ, అశ్రద్ధచేసేందుకూ సావకాశం వుంటేగా. మొగుడు చచ్చిన వితంతువునికదా—యింటికి రాగానే గరిట చేతికిచ్చారు. ఆ తర్వాత మూడేళ్లదాకా మా అక్కకీ, వదినకీ ఏటేటా కానుపులు. మా పెద్దమ్మకి పార్శ్వపునెప్పి మాబామ్మకి నల్లమందు. వాళ్లందరికీ వండి వార్చడంతో నాకు అసలు క్షణం తీరికవుండేదికాదు. మా అక్క మొగుడు పోయాక అది గూడా యిక్కడే జేరింది, ఏదో బావుకు తిందామని. మావదినకు కానుపు ఎడమయిందా ఏడు. అప్పుడు కాస్త ఆలోచించి, యీ వూబిలోంచి బయటపడ్డామని, మర్చిపోయిన ఎక్కాలూ తూకాలూ వల్లె వేయడం మొదలెట్టాను."

"ప్రయివేటు పెట్టుకోవలసింది"

"ఏదో సామెత చెప్పినట్టు—అసలుకే లేదు గాని...యింకా ప్రయివేటుట...వళ్లు విరిగేటట్టు చాకిరీచేసి—యిరవై ఏళ్లుదాటాక హెచ్చవేతలూ కూడికలూ చేస్తూ—నాపొట్ట నేను పోసుకుందామని తాపత్రయపడ్డూంటేనే, మా బామ్మ శాపనార్థాలు పెడ్తోంది. అలాటిది ప్రయివేటు కూడానా? ఆ హెడ్ మిస్ట్రెస్ మంచిది కనక—థరడ్ ఫారమ్‌లో చేర్చుకుని—స్కాలర్ షిప్ యిప్పించింది. యింకొక్క రెండేళ్ళు కళ్ళు మూసుకుంటే నా కష్టాలు గట్టెక్కుతాయి," అంది సత్యవతి.

*    *    *    *

రోజులు గడుస్తూండేవి. ఒకొక్క రోజున సత్యవతి స్కూలునుంచి నకనకలాడుతూ వచ్చేది. ఆ అమ్మాయి చాలా మొహమాటస్థురాలు. కాని ముఖం చూసి ఏదన్నా టిఫిన్ పెడితే, ఒకటి రెండుసార్లు అడిగించుకుని గాని తినేదికాదు. ఆకలితో మాడి పోతున్నాగూడా నోరు జాచి ఏమీ అడిగేది కాదు.

స్కూలుఫైనలు క్లాసులోకి వచ్చింది సత్యవతి. పరీక్షలు దగ్గిరకొస్తున్నాయి.

"బాగా చదువుతున్నావా? యీ పరీక్ష అయితే నువ్వు గట్టున పడ్డట్టే..."

"చదవడానికి చదువుతాను. అది బుర్రకు పట్టద్దూ? ఒదినకు మళ్ళీ కడుపు, మనిషి తోస్తే పడేట్టుంది. మొన్న కార్పొరేషన్ సెంటర్లో చూపిస్తే, బలానికి మందు కొనమని—ఆ మెరి నాలుగు అన్నని నాలుగు చివాట్లు వేసింది డాక్టరు. యివన్నీ యిలా వుంటే, చదువు ఏం బుర్రకెక్కుతుంది?"

"పోనీ మాయింటికొచ్చి చదువుకో. నేను ఖబుర్లేసుకుని, నీ చదువు పాడుచెయ్యనులే, నువ్వు హాల్లో చదువుకో ఆయన గదిలో పడుకుంటారు, మనిద్దరమూ హాలులో పడుకోవచ్చు."

"మా ముసలమ్మ యిప్పటికే యిలు ఒక ధరికి తెస్తోంది యింక రాత్రిళ్లు నేను యింట్లో పడుకోక పోతే, యిల్లుపికి పందిరేస్తుంది," అంది సత్యవతి.

పరీక్షలు వారంరోజులున్నాయనగా సత్యవతి వదినగారి కడుపు పోయింది. లేడిడాక్టరు ఆ చాకిరీ, ఆ యిల్లూ మారకపోతే వాళ్ళ వొదినకు టి. బి. రావడం ఖాయమని చెప్పిందట.

"పోనీ మీ అన్న మీ వదినని పుట్టింటికి పంపరాదూ?"

"ఆమెకు ఎవరూ లేరు. ఇక యిక్కడ మా అక్కకూడా మీ బామ్మకున్నంత నోరు. అరిచి గపట్టినా యిక అది ఆ చెంబు అక్కడ పెట్టదు. మా ముసమ్మ నల్లమందుముద్దలు మింగడానికీ, గెంజుసార్లూ వాయినం చెల్లించడానికీ తప్ప దేనికీ పనికిరాదు. మా పెద్దమ్మకి పార్శ్వపు నెప్పి, నాకు పరీక్షలు ఎలా చెప్పండి, మాయిల్లు ఒకకూపం. అంతే. అందులోంచి విమోచన లేదు"—

"అయితే మీ వదినసంగతి ఏంజేస్తారు?"

"ఏంజేస్తాం? చేసేందుకు ఏమీ లేదు. అయినా ఆడవాళ్లం ఏంచెయ్యదల్చుకుంటేనుటుకు ఎల్లా? మా చేతుల్లో కానీ లేదాయను. అంతా అన్నయ్యా వాళ్లే చూస్తారు......"

"మీ అన్నయ్యే ఏదన్నా టానిక్కులూ, పాలూపళ్లు-యివన్నీ యిప్పిస్తారేమో..."

"మీ రింకా దొడ్డిదార్లోవున్నారు. మా వాళ్లు విచిత్రమైన మనుషులు. మా వదినకి టి. బి. వచ్చినా, ప్రాణం మీదకివచ్చినా-మా అన్నయ్య మందులు కొనడు. 'ఎందుకు కొనవు?- లేకపోతే ఆవిడ చచ్చిపోతుంది,' అని నేను కల్పించుకు చెబుతాననుకోండి-డబ్బులేదు అంటాడు వాడు."

"డబ్బులేదుఅంటే ఎట్లా? ఏదో ఒక ఖర్చు తగ్గించుకోవాలి. ఆరోగ్యంతర్వాత అన్నీని."

"మీరు ఏదో ఒక ఖర్చుని అంతదూరం పోతారు. రోజూ వాడు కాల్చే ఆ సిగరెట్లూ, మా నాన్నగారు కాల్చే ఆ చుట్టలూ, మా ముసలమ్మ నల్లమందూ, యింట్లో పిల్లా పాపా అంతా తాగే కాఫీలు మానేస్తే టానిక్కులకి పళ్ళకీ రాదూఅడబ్బు! అసలు అక్కడదాకా ఎందుకు? ఆ వచ్చే నూట యిరవై కాఫీలూ, సిగరెట్లూ, మాని తిండికే ఖర్చు చేసుకుంటే, యిల్లా అర్ధాకలితో మాడటాలూ, జబ్బులూ వుండవుగా!- అంతే మా యిల్లూ, మనుషులూ అంతే! విచారించి ఏం లాభంలేదు," అంది నిస్పృహతో సత్యవతి.

నాకుకూడా నోటమాటరాలేదు. ఆ యిల్లు, ఆ మనుషులు, ఆ అలవాట్లూ, ఆ దారిద్ర్యం-అదంతా ఒక మురిగిన కుడితితొట్టె. వాళ్లంతా అందులోని క్రిమికీటకాదులు.

"పోనీ నువ్వయినా శ్రద్ధగా చదువు. పరీక్ష పాసయితే, ట్రయినింగ్ వెళ్ళవచ్చును" అన్నాను.

"చదుగుతున్నా...కాని..." అంది సత్యవతి నిరుత్సాహంగా.

అనుకున్నట్టుగానే, సత్యవతి పరీక్ష తప్పింది ఆ ఏడు.

పరీక్ష పోయిన సత్యవతి కుమిలి కుమిలి

ఏడ్చింది. నాకు వోదార్చడానికి మాటలు రాలేదు. పాపం! ఆ చదువుమీద పంచప్రాణాలు పెట్టుకుంది.

"ఏం జేస్తావు - నీ తప్పేముటు కేముంది? యింట్లో చాకిరీ, అందులో మీ వదిన జబ్బూ, అన్నీ కలిసి వచ్చాయి. మళ్ళీ ఏడుకి కూచుందువు గాని - యీలోపల ఏ కుట్టు పరీక్షకో వెళ్లు..." అన్నాను.

"నేను మళ్ళీ ఏడు గాదు, పదేళ్ళయినా ఆ పరీక్ష పాసవలేను చంటిపిల్లననుకుంటున్నారా? దగ్గిర దగ్గిర పాతికే వొస్తున్నాయి. అసలు యీ వయసులో చదువు ఎలా వంటబడుతుంది చెప్పండి? యింక ఆ స్కూలు ఫైనలు ఆశ వదులుకున్నాను. హయ్యర్‌గ్రేడ్ ట్రయినింగ్‌కి అప్లయ్ చెయ్యమంది మా హెడ్‌మిస్ట్రెస్. నెలనెలా స్టయ్‌పెండ్ గూడా వస్తుందట," అంది సత్యవతి.

"అది గాదు, యింతా కష్టపడ్డావాయను— హయ్యరు కెందుకంట? పోనీ, ఏ సేవాసదనంలో నన్నా జేరగూడదా?"

"ఎవరు జేరిపిస్తారు? మా అన్నను రమ్మంటే, మా నాన్నతో చెబుతాడు. అది కాస్తా మా ముసలమ్మకి తెలుస్తుంది. మా ముసలమ్మ వీధి అరుగుమీద నుల్చుని 'లేచిపోతోంది' అని గావుకేక లేస్తుంది."

"పోనీ, నీఅంతట నువ్వే వెళ్లు."

"అలా వెళితే, గార్డియన్ సంతకం కావాలన్నారు. నేను నిజంగా విడో నని సర్టిఫికెట్ కావాలన్నారు; ఎవరో సాక్షులు కావాలన్నారు. పాపం —మా బామ్మకు రోజుకు యిరవైసార్లు నా ముఖంమీద వధవతనం తాండవంజేస్తూ కనిపిస్తుంది గాని, ఆ సేవాసదనం వాళ్ళకి సాక్షి సంతకాల్లో గాని కనిపించేటట్టు లేదు......" అని నిరాశతో నవ్వింది సత్యవతి.

"ట్రయినింగ్ స్కూలు ఎక్కడట?" అని అడిగాను.

"ట్రిప్లికేన్‌లో వుందిట. నెలకి పన్నెండు రూపాయలు స్టయిఫండ్ యిస్తారట. మూడు నెలలకొకసారిగాని స్టయిపెండ్ రాదు ట్రిప్లికేన్‌కి వెళ్ళడం ఒకటే సమస్య" అంది కిటికీలోంచి మొహమాటంగా బయటకు చూస్తూ.

"ఏం?" అన్నాను అర్థంకాక.

"స్కూలయితే, మా యింటిదగిర కాబట్టి నడిచి వెళ్ళేదాన్ని. ట్రిప్లికేన్ అంటే నడవడం ఎల్లా - ట్రామ్ ఛార్జీ రాను లేదా - పోను లేదా. సీజన్ టికెట్టు అయినా కావాలి-" అంది యిబ్బందిగా.

"వోస్. దానికేం. నేనిస్తాను. అందుకోసం నువ్వు ఆలోచించకు."

"స్టయిపెండ్ వచ్చాక, మళ్ళీ తిరిగి పుచ్చుకునే మాటుంటే, మీదగ్గిర పుచ్చుకుంటూ, లేకపోతే వద్దు," అంది సత్యవతి.

"అవన్నీ యిప్పుడెందుకు?"

"అలా కాదు. మీరు మాట యిస్తేనే - లేకపోతే నాకు బావుండదు," అంది సత్యవతి.

"సరే" అని వప్పుకున్నాను.

* * *

సత్యవతి ట్రయినింగ్‌స్కూల్లో జేరింది. మొదటి రెండుమూడురోజుల్లో ఆ అమ్మాయి అన్నంగానీ, టిఫెనుగాని పట్టుకెళ్లడంలేదని గమనించాను.

"మధ్యాహ్నం ఏం తింటున్నావు? ఆకలి వెయ్యడంలేదా?" అని అడిగాను ఒకసాయంత్రం.

"అబ్బే - చిన్నపిల్లనా ఏమిటి ఆకలికి? అసలు విధవముండ ఒకపూట భోజనంచేసి - యింకోపూట వుప్పుపిండి తినాలిట. అంతికుమించి తినటంవల్లనే, నేనిట్లా గోడ్డమ్మట తిరుగుతున్నానట. మామామ్మ నడిగండి చెపుతుంది." అంది సత్యవతి.

ఆ అమ్మాయికి యిబ్బందిగావుండే ప్రశ్నలకిగానీ, సమాధానం చెప్పటం యిష్టంలేని వాటికిగాని నవ్వుతాలుగా వాళ్ల మామ్మమీదకి తోసి తప్పించుకుంటూ వుండటం నేను చాలాసార్లు చూశాను. పొద్దుట ఎనిమిదిన్నరకి అన్నంతిని, సాయంత్రం ఆరింటిదాకా ఏమీ తినకుండా వుండటం ఎంత కష్టమో, అందులో చిన్నపిల్లలతో అరిచి పాఠాలు చెపుతూ వుండటం ఎంత కష్టమో వూహించుకుని చాలా బాధపడ్డాను.

అప్పటినుంచీ యీసాకూ, ఆసాకూ కల్పించి, ఏటిఫిన్నో పళ్లో స్కూల్లో తినేందుకు యిస్తూండేదాన్ని. రెండుమూడుసార్లు మాయింటినించి కారియర్ అన్నంతీసుకెళ్ళమని అడిగితే, ససేమిరా వద్దంది. అందుకని వూరుకునేదాన్ని. స్టయిఫండ్ రాగానే, నేనిచ్చిన డబ్బు, అణాపైసల్తో లెక్కగట్టియిచ్చి- మిగతా చిల్లరా రూపాయలూ వాళ్ళ వొదినకు తీసుకెళ్లి యిస్తూండేది.

మరీ చినిగి -ఎక్కువ కుట్లువున్న చీరెలు కట్టుకోడంచూసి, ఒకటిరెండుసార్లు - రెండు మూడు చీరెలు ప్రజెంటుగా కొనిద్దామని ప్రయత్నంచేశాను.

సత్యవతి తీసుకోనని నిర్మొహమాటంగా చెప్పింది. ఒకసారి కోపంవచ్చిందికూడాను.

"కొత్తచీరె కొంటే నాకొక్కదానితోనే తీరదు. మావదిన యింతకంటే వాలికలు కడ్తోంది. మా అక్కకి చీరెలు లేవు. మా పెద్దమ్మ తన పెళ్లిలో పెట్టిన పట్టుచీరెను కట్టుడుచీరెకింద కట్టుకుంటోంది. మా ముసలమ్మ చిరిగినపంచెలు అతుకేసి కట్టుకుంటోంది. మా అన్నయ్య చొక్కాలన్నీ బుజాలమీద చినిగినవే. యింక పిల్లలగుడ్డలు చెప్పనక్కర్లేదు. అందుకని మా దరిద్రం రెండుచీరెల్తో తీరదు."

"వాళ్ళందరిసంగతి నాకనవసరం. నువ్వు స్కూలుకి వెళ్లేదానివి. నీకు కాస్త శుభ్రమయిన చీరె కావాలి. అందుకని అంటున్నాను. పోనీ నువ్వు సంపాయించి, నా అప్పు తీరుద్దువుగానిలే." అన్నాను ఆమె మనసు ఎరిగినదాన్ని కాబట్టి.

"మీ అప్పు డబ్బుతో తీరిపోతుందా - అలా అనకండి. నేనొక్కదాన్నీ మంచిచీరెలు కట్టడం భావ్యం కాదు. యింక ఆగొడవ వదిలేద్దాం," అంది, సత్యవతి తడికళ్ళతో.

సత్యవతి మొదటి ఏడు కోర్సు పూర్తి అయిపోయింది. రెండో సంవత్సరం క్రిస్మస్ శెలవలు కూడా అయిపోయాయి. మార్చి నెలలో ఆయనకేదో కలకత్తా వెళ్ళవలసిన పనివచ్చింది. మూడు నెలలు అక్కడే వుండాలి. ఏప్రిల్ — మే, జూన్ జూలై మొదటివారంలోగాని మద్రాసు రావటం పడదు. ఈ మూడు నెలలూ నన్ను పుట్టింట్లో వుంచుతానన్నారు.

మేము ఆ వూరునుంచి కదిలి వెళ్తున్నామని తెలియగానే సత్యవతి దుప్పలా కూలిపోయింది. ఒకటే ఏడ్చింది.

"ఇంట్లో ఎలావున్నా మిమ్మల్నీ, ఆ బడినీ చూసుకుని నా కష్టాలు మర్చిపోగల్గుతున్నాను. మీరెళ్లిపోతున్నారు ఎల్లా?"

"వెళ్తే ఏం? మళ్లీ మూడు నెలల్లో వచ్చేస్తాను. యీలోపల నీపరీక్షలయిపోతాయి. రిజల్ట్సుకూడా తెలుస్తాయి. యీ దగ్గర్లోనే కార్పొరేషన్ స్కూలుకి అప్లయి చెయ్యి. దగ్గిర స్కూలయితే — టైము చాలా వుంటుంది. అప్పుడు స్కూలు ఫైనలు పూర్తి చెయ్యవచ్చును." అన్నాను ధైర్యం చెబుతూ.

"ఏమో — అసలు నా బతుకంతా చీకటిగా వుంది. మీరుగూడా వెళ్తున్నారు. ఏం చదువుతానో!"

"ఎందుకు చదవవు — నిక్షేపంలా చదివి పాసవుతావు. అధైర్యపడకు," అన్నాను హోల్డాలు కడుతూ.

పాపం! సత్యవతిని చూస్తే జాలేసింది. నిజానికి ఆ సమయంలో ఆ అమ్మాయిని వదిలి వెళ్లాలని నాకు లేదు. అయినా వెళ్లక తప్పదు. "మీరు కలకత్తా వెళ్ళండి. నేను యీ అమ్మాయికోసం యీ వూర్లో వుండిపోతాను — పుట్టింటికి వెళ్ళను," అని నేను చెబితే, అర్థం చేసుకోకలిగిన వోపికా, హృదయ వైశాల్యం మా ఆయనకు వున్నాయా? లేవు. కావున అది నాకు నిశ్చయంగా తెలుసు. అందుకే ప్రయత్నించడం అనవసరం. కాని సత్యవతి మొదటినుంచీ అష్టకష్టాలుపడి, ఆయాసపడుతూ మెట్లన్నీ ఎక్కి ఆఖరి మెట్టుమీదవున్న సమయాన్న — నేను ఆ మెట్టు దాటేందుకు చేయూత నియ్యలేకపోయాను. ఎలా యిస్తాను? స్వతంత్రురాల్ని కాదు. చీరెలూ, నగలూ, ఇల్లూ — వీటన్నిటినీ నా ఇష్టాల మీద వదిలేస్తారుగాని — 'నా స్నేహితురాలికోసం వుండిపో' అనేటంత హృదయం మావారికి లేదు. అది నాకు తెలుసు. అందుకే నిస్సహాయంగా ఏడ్చే సత్యవతిని, నిరుపయోగమైన మాటల్తో వోదారుస్తూ కలకత్తా మైలు ఎక్కాను.

* * * *

వారానికొక వుత్తరం రాస్తూ, ప్రతి కవర్లో రిప్లయ్‌కోసం మరో స్టాంప్డ్ కవరు పెట్తుండేదాన్ని. ఆమె జవాబులు రాస్తూండేది. ప్రతి వుత్తరంలో అన్నీ మామూలేననీ, నేను లేకపోవడంవల్ల చాలా పిచ్చిగావుందనీ రాస్తూండేది.

పరీక్షలలో బాగానే రాశాననీ, పాసవగల ధైర్యం వుందనీకూడా రాసింది వుత్తరాల్లో.

పరీక్షఫలితాలొచ్చాయి. అందులో సత్యవతి నెంబరు లేదు. ఆ రాత్రి నాకు నిద్దరపట్టలేదు. సత్యవతి ప్రయత్నానికి, భగవంతుడుగూడా ఎందుకు ఎదురవుతున్నాడని విచారించాను. పాపం! ఇంక ఆ అమ్మాయిగతేమిటి? మళ్ళీ గరిటేనా? ఆ యిల్లు, ఆ మురికి, జబ్బులు, నల్లమందు, చుట్టలు, దోమలు — వీటినుంచి నా సత్యవతికి విముక్తి లేదా?

ఆ మూడోనాడు వుత్తరం వచ్చింది.

"ఈసారిగూడా వోడిపోయాను. అయిపోయింది. యింక చదవను. మా బామ్మ చెప్పినట్లు భగవంతుడు నా నొసట 'అంటతిప్పేలా' రాశాడు. అది అక్షరాలా నిజం. మీరుగూడా లేరు. ఎవరితో చెప్పుకుని ఏడవను. మీ సత్యవతి."

జవాబు ఏం రాయను? సత్యవతిని ఎలా ఓదార్చను? ఏవేవో అర్థంలేనిమాటల్తో ఓదారుస్తూ వుత్తరం రాశాను. అంతే, మళ్ళా వుత్తరాలేమీ రాలేదు సత్యవతిదగ్గిరనుంచి.

* * *

"ఏమిటి అంతదీర్ఘంగా ఆలోచిస్తున్నావు" అంది మరకతం.

"అబ్బే, ఏం లేదు." అంటూ తప్పించుకుని, రిబ్బను ముడి వేసుకుంటుంటే, మెట్లమీద పోస్టుమేన్ కేక వినపడింది. వెళ్లి వుత్తరం అందుకున్నాను. సత్యవతి దస్తూరి.

అవ్యక్తానందంతో తడబడుతూ కవరు చించాను.

"మీరు రేపుపొద్దున్న వూరునించి వస్తారు. అందుకే, మీరు వచ్చేటప్పటికి నా వుత్తరం మీకు అందాలని రాస్తున్నాను. మీ సత్యవతిగురించి వేరే ఎవరినోటనో వినకుండా, ఆమె నోటమ్మటే వినాలని రాస్తున్నాను. నే నిప్పుడు దండివనంలో వున్నాను. ఆశ్చర్యంగా వుందా? అవును, నాకే ఆశ్చర్యంగా వుంది.

"నా జీవితంలో, అంటే పుట్టి బుద్ధెరిగాక యిన్నై చీరెలు, నావి, 'నా స్వంతం' అనుకునేవి యిన్నైవుండటం యిదే మొదటసారి. ఆ చీరెల దొంతర బీరువాలో మొట్టమొదటసారి పేర్చుకుని చూశాక, నాకు కన్నీళ్లు ఆగలేదు. అలా మీరు బీరువాలో పేర్చుకోడం చూశాను మొదటిసారి. అచ్చు అలాగే పేర్చుకున్నాను. పేరుస్తున్నంతసేపూ మీరే మనసులో మెదుల్తున్నారు. ఇక్కడ నాకు 'నా స్వంతం' అని చెప్పుకునే యిల్లుంది. ఇంటిచుట్టూ చిన్నతోట. నా కోసం, నా సుఖంకోసం పాటుబడి, నా ఆనందంలో పాలుపంచుకునే మనిషి ఒకరున్నారు. 'వధవముండా-బోడిముండా-' అని తిట్టకుండా నన్ను ఒక మనిషికింద జమకట్టే మనిషి ఒకరున్నారు.

"మాసందులో మొదటియింట్లో వున్న మొదలియార్లు మీకు జ్ఞాపకం వున్నారా? ఆ మొదలియారుకి తమ్ముడొకాయన వున్నాడు. ఆయన భార్య పోయి అయిదేళ్ళయింది. అతనికి యాభైఏళ్లు; ఇద్దరు పిల్లలు. చాలా రోజులనుంచీ ఆయన నావంక ఒకవిధంగా చూడటం కనిపెట్టాను. మీతో ఒకసారి చెబుదామనుకున్నాను, గాని చెప్పడానికి సిగ్గుపడటమే కాకుండా భయపడ్డాను. ఏం చెయ్యను చెప్పండి? మా అన్న పిల్లలు, అక్కపిల్లలూ ఎదుగుతున్నారు. చదువులేవు, శుభ్రమయినబట్టా తిండీ లేదు. ముసలమ్మ ఏనాటికీ చచ్చిపోదు; నల్లముండ కావాలంటుంది. ఒదినకు టి. బి. రావటం ఖాయం. మళ్ళీ కడుపు ఒకటిపోయింది. మా నాన్నలు చుట్టలు మానరు. అన్నయ్య సిగరెట్లు మానడు. ఇంట్లో వాళ్లు కాఫీలు మానరు. మీరు చెప్పండి ఆ యింట్లో పుట్టినవాళ్ళకి అసలు విముక్తి అంటూ కలుగుతుందా? కలగదు. ముమ్మాటికీ కలగదు.

"నేను పరీక్ష పాసయివుంటే; వీళ్ళని వదిలించి మరోచోట వుండి, కడుపునిండా తిని, వంటినిండా బట్టకట్టుకునే అవకాశం లభించేది. నాకా అవకాశం కలగదు. ఎందుకంటే నేను పరీక్షలు అవలేను. ఆ వాతావరణంలో నా బుర్రకి చదువు ఎక్కదు. యింక నే నేం చెయ్యాలి? గరిటపుచ్చుకుని టి. బి వదినకీ, నల్లముండ మామ్మకీ, రెండేకరాల అక్కయ్యకీ, పార్శ్వపు నొప్పి పెద్దమ్మకీ చచ్చేదాకా చాకిరి చెయ్యాలి—అంతేనా? అదే నా జీవితానికి అర్థం? అందుకేనా నేను పుట్టింది?

"పుట్టినప్పటినుంచీ ఒక్క సుఖం ఎరగను. జీవితంలో ఏకొంత కాలమున్నా హాయిగా గడిపితే, అది మీదగ్గిరే! అదిమటుకు మర్చిపోను. ఇదంతా ఎందుకు రాస్తున్నానంటే— నేనెందుకు యీ పని చేశానో మీకు తెలియజెప్పేందుకు. నేను ఎవరికీ చెప్పక్కర్లేదు—మీ వొక్కరికే తప్ప. అందుకని రాస్తున్నాను.

"పరీక్ష తప్పిన నాలుగో రోజున ఎందుకో వీధిలో నిల్చుంటే—ఆ మొదలియారుగారి తమ్ముడు ఒక చీటి నా చేతులో పెట్టి, గబగబ వెళ్ళిపోయాడు. విప్పి చూసుకుంటే ఏముందాలో అదే వుంది. కాని వెర్రిమొర్రి ప్రేమలేఖ కాక తన ఆస్తి వివరాలు రాస్తూ, తనను పెళ్ళిచేసుకోమని ప్రార్థించాడు.

"ఆ రాత్రంతా ముందు వెనకలు ఆలోచించాను. ఏమైనా, లేచిపోయి రమ్మన లేదుగా. పెళ్లి చేసుకుంటా నంటున్నాడు. పెద్దవాడు కనక నే నన్ను చేసుకుంటా నన్నాడు. లేకపోతే ఎవరికి కావాలి నేను? ఎక్కడయినా వంటేగా నేను చెయ్యగలిగేది! మావాళ్ళదగ్గిరయితే చాలీ చాలని తిండి. మరో యింట్లో వంటమనిషిగా కుదిరేందుకు పూర్తిగా వయసు మళ్ళినదాన్ని కాకపోవడంవల్ల అనేక ఈతిబాధలు. ఎన్నిరకాల ఆలోచించినా, ఆయనని చేసుకోవడంవల్ల నాకు పోయిందేమీ కనిపించలేదు. అసలు ఏముంది కనక పోయేందుకు!

అందుకని ఆయనని పెళ్ళి చేసుకున్నాను. ఇద్దరు పిల్లలూ నన్ను ఎంతో ఆప్యాయంగా 'పిన్నీ' అని పిలుస్తున్నారు.

"నేను చేసిన పని తప్పంటారా? అయితే అవవచ్చు. కాని యిప్పుడు శుభ్రంగా తిని, మంచిబట్టలు కట్టుకుంటున్నాను. నేనూ ఒక మనిషినని అనిపించుకుంటున్నాను. ఎవరేమనుకున్నా, మీరు సత్యవతిని తప్పుబట్టరు. అందుకనే మిమ్మల్ని దిండివనానికి ఒకసారి రమ్మనమని ధైర్యంగా కోరుతున్నాను.

మీ సత్యవతి."

*          *          *

"ఏవిటా వుత్తరం?" అంది మరకతం గుమ్మంలో నుల్చుని.

"ఆ ఏమీ లేదు. ఎవరో ఎరుగున్నవాళ్లు రాశారు," అన్నాను.

"మీ సత్యవతి ఎవరితో లేచిపోయిందో తెలుసా—ఆ బొంకు మొదలియార్తో!" అంది మరకతం.

"అలాగా" అన్నాను. ఏదో ఒకటి అనాలిగా!

సినీమాకి వెళ్ళాలని తొందరబడుతూ వెళ్ళిపోయింది మరకతం.

నాకు సత్యవతిమీద కోపం రాలేదు. మావారినడిగి, వచ్చే నెలలో దిండివనం వెళ్తాను.

